క్లుప్తంగా

ఉపాధి పనుల పరిశీలన



మస్తర్లు పరిశీలిస్తున్న ఎంపీడీఓ పట్నాయక్

వేపాడ: జగ్గయ్యపేట గ్రామంలోని కోమటి చెరువులో చేపడుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ బి.ఎస్.ఎస్.కె.పట్నాయక్ గురువారం పరిశీలించారు. వేతనదారులతో ఆయన మాట్లాడుతూ నిబంధనల ప్రకారం పనిచేస్తే ప్రభుత్వం నిర్దేశించిన గరిష్ట వేతనం అందుతుందని చెప్పారు. ఉదయం వేగంగా పనులకు హాజరై ఎండ తీవ్రత పెరగక ముందే పనులు ముగించాలని సూచించారు. పనిప్రదేశంలో తాగునీరు, టెంట్లు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలని ఫీల్డ్ అసిస్టెంట్‌కు సూచించారు. అనంతరం వేపాడ పీహెచ్‌సీ సిబ్బంది వేతనదారులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులు పంపిణీ చేశారు.

యోగాతో మానసిక ఒత్తిడి దూరం



విద్యార్థులతో యోగా చేయిస్తున్న రామకృష్ణరాజు

బొండపల్లి: యోగాతో మానసిక,శారీరక ఒత్తిడిని అధిగమించవచ్చని, సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండవచ్చని పిరమిడ్ సేవాదళ్ జిల్లా కన్వీనర్ వి.రామకృష్ణరాజు అన్నారు.గొట్లాం గ్రామంలోని గాయత్రి జూనియర్ కళాశాలలో విద్యార్థులకు యోగా సాధనపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు రోజూ కాస్త సమయం యోగాకు కేటాయించాలని సూచించారు. పరీక్షల సమయం దగ్గరపడుతున్న కొద్దీ భయం, మానసిక ఒత్తిడి ఎక్కువ అవుతుందని, యోగా చేయడం ద్వారా ఒత్తిడి నుంచి ఉపశమనం పొందవచ్చని అన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఫిర్యాదుపై విచారణ

గజపతినగరం: గజపతినగరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయకుమారిపై అదే కళాశాలలో పని చేస్తున్న అధ్యాపకుడు సన్యాసిరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జిల్లా వృత్తివిద్యా అధికారి సురేష్‌కుమార్ గురువారం విచారణ జరిపారు. నాడు–నేడు పనుల నిర్వహణ, హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. స్టాఫ్ మీటింగ్ పేరుతో అక్రమ వసూళ్లపై ఆరా తీశారు. విచారణ పూర్తయ్యాక నివేదికను ఆర్‌జేడీకి అందజేస్తానని చెప్పారు.

పాఠశాలల సందర్శన



మరడాం పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తున్న డీఈఓ లింగేశ్వరరెడ్డి

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం, మరడాం ఉన్నత పాఠశాలలను డీఈఓ లింగేశ్వరరెడ్డి గురువారం సందర్శించారు. 8వ తరగతి విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో ప్రభుత్వం అందజేసిన ట్యాబ్‌ల ద్వారా విద్యార్థులు పాఠాలు వింటున్నదీ లేనిదీ పరిశీలించారు. ట్యాబ్‌ల వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పదోతరగతి విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని, వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని హెచ్‌ఎంలను ఆదేశించారు. మరడాం పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేశారు.

నవధాన్యాల సాగుతో భూసారం



రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

బొండపల్లి: నవ ధాన్యాల సాగుతో భూమి సారవంతమవుతుందని గజపతినగరం సబ్ డివిజన్ ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ బి.సత్యనారాయణ తెలిపారు. దేవుపల్లి గ్రామంలో రైతులకు నవధాన్యాల సాగుపై గురువారం అవగాహన కల్పించారు. ముందుగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ వరి నాట్లు వేయడానికి 45 రోజుల ముందు సంబంధిత పొలంలో ఎకరానికి 13 కిలోల నవ ధాన్యాల విత్తనాలను చల్లాలని చెప్పారు. పచ్చిరొట్ట ఏపుగా పెరిగిన తర్వాత కలియదున్నాలని వివరించారు. ఇలా చేయడం వల్ల నేలలో సేంద్రియ కర్బనం పెరిగి సూక్ష్మజీవులు వృద్ధి చెంది సహజ పద్ధతిలో పంటకు పోషకాలు అందుతాయని చెప్పారు. మండల యాంకర్ బి.బంగారం, ఐసీఆర్పీ మీనా కుమారి, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే సామాజిక న్యాయం

- బీసీ,ఎస్సీ,ఎస్టీ, మైనార్టీలకు అధిక ప్రాధాన్యత
- ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య


గజపతినగరం: దేశంలో ఎక్కడా లేని విధంగా బీసీ,ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు పరిపాలనలో పెద్ద ఎత్తున భాగస్వామ్యం కల్పించి, సామాజిక న్యాయం పాటించిన ఘనత సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాజాగా ప్రకటించిన 18 ఎమ్మెల్సీ స్థానాల్లో 14 ఎస్సీ, ఎస్టీ,బీసీలకు సీఎం జగన్ కేటాయించారని, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన చేస్తున్న కృషికి, చిత్తశుద్ధికి ఇదే నిదర్శనమన్నారు. ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే సీట్లే కాకుండా, స్థానిక సంస్థల ఎన్నికల్లోను, నామినేటెడ్ పదవుల్లో 75శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకే కేటాయించారని చెప్పారు. వెనుకబడిన వర్గాల వారిని చట్టసభల్లోకి తీసుకువస్తానని పాదయాత్ర, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని సీఎం జగన్ నిలబెట్టుకున్నా రని అన్నారు. ఆయన మాట ఇస్తే తప్పకుండా నెరవేరుస్తారనే నమ్మకం ప్రజల్లో ధృడంగా ఉందని అన్నారు. తూర్పుకాపులు, వెలమలకు అన్యాయం జరుగుతోందంటూ పలు పత్రికల్లో వచ్చిన కథనాలు, టీడీపీ నాయకులు చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని కొట్టి పారేశారు. ఇంతకు ముందు ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించిన పాలవలస విక్రాంత్ తూర్పుకాపు సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కాదా అని ప్రశ్నించారు.ఉత్తరాంధ్ర కొప్పల వెలమకు చెందిన దర్మాన కృష్ణదాస్‌కు ఉపముఖ్యమంత్రి పదవి ఇచ్చిన విషయం గుర్తు చేశారు. కార్పొరేషన్‌లు ఏర్పాటు చేసి వాటికి చైర్మన్‌లు, డైరెక్టర్లను నియమించామని చెప్పారు. ఎన్నడూ లేని విధంగా బీసీలకు సీఎం జగన్ అధిక ప్రాధాన్యత కల్పిస్తుంటే, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో బీసీలకు అన్యాయం జరుగుతోందంటూ టీడీపీ నాయకులు ప్రచారం చేయడం సిగ్గుమాలిన చర్య అని మండిపడ్డారు. టీడీపీ హయాంలో శాసమండలిలో ఏకులాలవారు అధికంగా ఉన్నారు, ప్రస్తుతం ఏయే కులాలవారు ఉన్నారన్నది ఒక్కసారి బేరీజు వేసుకోవాలని సూచించారు.

జిల్లా అభివృద్ధిపై మాట్లాడే హక్కు టీడీపీకీ లేదు

జిల్లా అభివృద్ధిపై మాట్లాడే హక్కు టీడీపీకీ లేదని ఎమ్మెల్యే అన్నారు. విజయనగరం జిల్లాకు మెడికల్ కళాశాల మంజూరు చేసి, ఈ ఏడాదికే 150 సీట్లను భర్తీచేసేలా చర్యలు తీసుకున్న సీఎం జగన్‌కు జిల్లా ప్రజానీకం తరపున ఆయన కృతజ్ఞతలు తెలిపారు. గజపతినగరంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేసి టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్‌ను నియమించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని వివరించారు. జిల్లాలో ఒక్క మంచి కార్యక్రమం చేశామని మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని చెప్పమనండి చూద్దాం అని సవాల్ విసిరారు. గజపతినగరం, సాలూరు, పార్వతీపురం ఆస్పత్రుల స్థాయిని పెంచి, కోట్ల రూపాయలతో వాటిని ఆధునికీకరిస్తామని చెప్పారు. గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుతో పాటు ప్రజలకు అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలన్నీ చేస్తున్నామని వివరించారు. మార్చి 18వ తేదీ నుంచి జగనే మానమ్మకం, జగనే మాభవిష్యత్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ తరపున ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా సీతంరాజు సుధాకర్ పోటీ చేస్తున్నారని, ఆయన్ని పట్టభద్రులంతా గెలిపించాలని కోరారు. జెడ్పీటీసీ గార తవుడు, ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు కరణం ఆదినారాయణ, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు సామంతుల పైడిరాజు, తుమికాపల్లి సర్పంచ్ బెల్లాన త్రినాథరావు, కె.రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారం

- ఎస్.కోట సబ్‌డివిజన్‌లో మంజూరైన ఇళ్లు 8,741
- పూర్తయినవి 3,211, తుది దశలో 1,543



ఎస్.కోట జగనన్న కాలనీలో పూర్తయిన ఇళ్ల నిర్మాణం

శృంగవరపుకోట: పేదల సొంతింటి కలను సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేస్తున్నారు. అర్హత ఉండి ఇళ్లు కట్టుకుంటామని ముందుకు వచ్చి, స్థలం ఉన్న వారందరికీ గృహాలు మంజూరు చేశారు. అలాగే భూమిలేని పేదల కోసం గ్రామాలు, పట్టణాలు అని తేడా లేకుండా ప్రభుత్వం భూసేకరణ చేసి జగనన్న లేఅవుట్లను ఏర్పాటు చేసి పట్టాలు పంపిణీ చేసింది. ఆయా లేఅవుట్లను అభివృద్ధి చేసి, ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన అన్ని సదుపాయాలను ప్రభుత్వం కల్పించింది. కోట్ల రూపాయలు ఖర్చు చేసి విద్యుత్, రోడ్లు, తాగునీరు, వంటి మౌలిక సౌకర్యాలను కల్పించారు. నిర్మాణల కోసం లబ్ధిదారులకు ప్రభుత్వం ఉచితంగా ఇసుక, రాయితీపై సిమెంట్, ఐరన్ అందిస్తోంది. ఇళ్ల నిర్మాణ దశ ఆధారంగా ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లిస్తున్నారు. దీంతో ఇళ్ల నిర్మాణాలు జోరందుకోవడంతో జగనన్న లే అవుట్లు ఊళ్లుగా మారుతున్నాయి. ఎస్.కోట నియోజకవర్గంలోని సబ్‌డివిజన్ పరిధి నాలుగు మండలాల్లో ఫేజ్–1 లో 8,741 మంది ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేసింది. ఎస్.కోట మండలంలో 3,467 మందికి, కొత్తవలస మండలంలో 1,987 మందికి, లక్కవరపుకోట మండలంలో 1,689 మందికి, వేపాడ మండలంలో 1,598 మందికి ఇళ్లు మంజూరు చేశారు. వీరిలో సొంత స్థలాలు ఉన్నవారు 5,626మంది కాగా, ఇళ్ల స్థలాలు పొందిన వారు 3,115 మంది ఉన్నారు. వీటిలో 3,211 ఇళ్ల నిర్మాణం పూర్తికాగా, 1,543 తుది దశలో, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. మిగిలిన లక్ష్యాలను సాధించడం కోసం అధికార యంత్రాంగం సమాయత్తమవుతోంది. జగనన్న కాలనీల్లో మార్చి నాటికి 4,754 మంది లబ్ధిదారులతో సామూహిక గృహప్రవేశాలు చేయించేందుకు అధికారులు కృషి చేస్తున్నారు.

రీసర్వేతో భూసమస్యలకు పరిష్కారం



డ్రోన్ సర్వేను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ అప్పలనాయుడు, తదితరులు

గుర్ల: ఎన్నో ఏళ్లుగా రైతులు ఎదుర్కొంటున్న భూసమస్యలకు వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా చేపడుతున్న సమగ్ర భూరీసర్వే ద్వారా శాశ్వత పరిష్కారం లభించనుందని జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు తెలిపారు. భూపాలపురంలో డ్రోన్ సర్వేను గురువారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వందేళ్ల తర్వాత ఈ తరహా సమగ్రసర్వేను ప్రభుత్వం చేపడుతోందని చెప్పారు. రికార్డుల డిజిటలైజేషన్ చేసి శాశ్వత హక్కులతో రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు అందించనున్నామని తెలిపారు. సర్వేచేసే సమయంలో రైతులు తమ పొలాల వద్ద ఉండాలని,అభ్యంతరాలు ఉంటే సర్వే సిబ్బంది దృష్టికి తీసుకువెళ్లి వారికి సహకరించాలని కోరారు. సర్పంచ్ శీర విజయలక్ష్మి, నడుపూరు సర్పంచ్ కర్రోతు తాతమ్మ , రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ పునః ప్రతిష్ట



గంట్యాడ: ఆలయ ప్రతిష్ట పూజల్లో పాల్గొన్న భక్తులు

గంట్యాడ: మండలంలోని మధుపాడ గ్రామంలో ఉమా నీలకంఠేశ్వరస్వామి ఆలయ పునః ప్రతిష్ట ఉత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులతో వేద పండితులు ప్రత్యేక పూజలు చేయించారు. స్థానిక సర్పంచ్ తెంటు శ్రీరామ్మూర్తి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

వైభవంగా గ్రామదేవత పండగ

లక్కవరపుకోట: మండలంలోని శ్రీరాంపురంలో గ్రామదేవత పాదాలమ్మ వారి పండగను గురువారం వైభవంగా నిర్వహించారు. గ్రామస్తులు అమ్మవారి ప్రతిమలు, ఘటాలతో ఊరేగింపుగా పూజారితో కలిసి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి మహిళలు పసుపు, కుంకుమ సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామపెద్దలు పాల్గొన్నారు.



లక్కవరపుకోట: అమ్మవారి ఆలయానికి ఊరేగింపుగా వెళుతున్న శ్రీరాంపురం గ్రామస్తులు

కొనసాగుతున్న భూసర్వే



వల్లంపూడిలో భూసర్వే చేస్తున్న సిబ్బంది

వేపాడ: మండలంలోని వల్లంపూడి, శింగరాయి గ్రామాల్లో రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో, రైతుల సమక్షంలో సమగ్ర భూరీసర్వే కొనసాగుతోంది. వల్లంపూడిలో జిరాయితీ, మెట్టు, ప్రభుత్వ భూమి, చెరువులు కలిసి 1,437.37 ఎకరాల విస్తీర్ణం ఉండగా ఇప్పటికవరకు 387 ఎకరాల్లో సర్వే పూర్తయిందని వీఆర్‌ఓ బాలభాస్కర్ గురువారం తెలిపారు. శింగరాయిలో 237 ఎకరాల్లో సర్వే పూర్తయిందని వీఆర్‌ఓ సత్యవతి చెప్పారు. సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌కు ఏర్పాట్లు



వాలీబాల్ కోర్టులు సిద్ధం చేస్తున్న క్రీడాకారులు

చీపురుపల్లి: పట్టణంలోని కనకమహాలక్ష్మి అమ్మవారి జాతర నేపథ్యంలో జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆర్థిక సహకారంతో ఈ నెల 26, 27 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌కు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు పి.సి.స్వరూప్, కె.మురళీధర్ నేతృత్వంలో దేవస్థానం సమీపంలోని ఖాళీ ప్రదేశంలో వాలీబాల్ కోర్టులను సిద్ధం చేసే పనులను క్రీడాకారులు గురువారం ప్రారంభించారు. రెండు రోజుల ఫ్లడ్‌లైట్ల వెలుతురులో ఈ పోటీలు జరగనున్నాయి.

సమష్టి కృషితో విజయఢంకా మోగిద్దాం



సీతంరాజు సుధాకర్‌ను పార్టీ శ్రేణులకు పరిచయం చేస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

- పట్టభద్రుల వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి పరిచయ కార్యక్రమంలో ఎమ్మెల్యే కడుబండి

లక్కవరపుకోట: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను అధిక మెజార్టీతో గెలిపించేందుకు అంతా కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ శ్రేణులకు ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మండల కేంద్రానికి సమీపంలోని శ్రావణి కల్యాణ మండపంలో ఎస్.కోట నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశాన్ని ఎమ్మెల్యే అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ముందుగా పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను నాయకులకు పరిచయం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాల ప్రజలకు పార్టీలకు అతీతంగా పథకాలు అందుతున్నాయని, విద్యారంగం అభివృద్ధికి సీఎం జగన్ అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు. జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన, విదేశీ విద్యాదీవెన, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాల ద్వారా ఎంతోమంది పేద విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసించారని, వారందరికీ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమం, అభివృద్ధిని వివరించాలని సూచించారు. లబ్ధిపొందిన ప్రతి ఓటరునూ ఓటు అడిగే హక్కు మనకు ఉందని, నియోజకవర్గం పరిధిలో ఉన్న సుమారు 9,600 మంది పట్టభద్రుల ఓటర్లను ప్రతి ఒక్కరినీ కలిసి వారి మద్దతు కోరదామని అన్నారు. ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు మాట్లాడుతూ సీతంరాజు సుధాకర్‌ను గెలిపించి రాష్ట్రాభివృద్ధికి పాటుపడుతున్న సీఎం వైఎస్.జగన్ మోహన్ రెడ్డికి కానుకగా ఇద్దామని, ఆయన నమ్మకాన్ని నిలబెడదామని చెప్పారు. నియోజకవర్గ పార్టీ పరిశీలకులు, మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్‌కుమార్, రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కలి నాయుడుబాబు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర అభివృద్ధికి సీఎం జగన్ ఎంతగా కట్టుబడి ఉన్నారో చెప్పడానికి నిదర్శనం విశాఖపట్టణాన్ని రాజధానిగా ప్రకటించడమే ఒక ఉదాహరణ అని వివరించారు. సీతంరాజు సుధాకర్ మాట్లాడుతూ తనను గెలిపిస్తే జగన్ మోహన్‌రెడ్డిని గెలిపించినట్లేనని, ఉత్తరాంధ్ర అభివృద్ధికి అందరి సహకారంతో మరింత కృషి చేస్తానని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రొంగలి జగన్నాథం, డీసీసీబీ చైర్మన్ వేచలపు చిన్నరామునాయుడు, రాష్ట్ర యువజన నాయకులు తుల్లి చంద్రశేఖరరావు యాదవ్, కొత్తవలస మార్కెటింగ్ చైర్‌పర్సన్ మూకల కస్తూరి, నియోజకవర్గంలోని అయిదు మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మండల పార్టీ అధ్యక్షులు, వైస్ ఎంపీపీలు, కార్పొరేషన్‌ల డైరెక్టర్లు, సచివాలయ కన్వీనర్లు, సర్పంచ్‌లు,ఎంపీటీసీలు, ముఖ్యనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తోటపల్లి కాలువ భూమి ఆక్రమణ



కాలువ భూమిలో ఆక్రమణదారులు పాతిన సిమెంట్ స్తంభాలు

చీపురుపల్లి: పట్టణ శివారున గెడ్డమిల్లు వెనుక భాగంలో రావివలస గ్రామానికి వెళ్లే రహదారిలో తోటపల్లి కుడి ప్రధాన కాలువ భూమి ఆక్రమణకు గురయ్యింది. ప్రధాన కాలువ పక్కన గెడ్డమిల్లుకు చెందిన యజమాని భూమి ఉంది. తాజాగా ఆ గెడ్డ మిల్లు యజమాని తన భూమిని చదును చేయించి కంచె వేసేందుకు చుట్టూ సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేశారు. ఆ మిల్లు యజమాని స్థలానికి దక్షిణం వైపు తోటపల్లి కుడి ప్రధాన కాలువ ప్రవహిస్తోంది. సిమెంట్ స్తంభాలను తమ స్థలం దాటి కాలువ భూమల్లో కూడా ఏర్పాటు చేశారు. తోటపల్లి కుడి ప్రధాన కాలువ నుంచి ఇరువైపులా 15 మీటర్ల నుంచి 40 మీటర్ల వరకు కాలువకు చెందిన భూములే ఉంటాయి. అందుకు అనుగుణంగానే ప్రభుత్వం భూసేకరణ చేసింది. అయితే ఇక్కడ తోటపల్లి కుడి ప్రధాన కాలువకు కేవలం ఆరు మీటర్ల దూరంలోనే కంచె వేసేందుకు సిమెంట్ స్తంభాలు పాతారు. దాదాపు పది నుంచి పదిహేను మీటర్ల వెడల్పులో 200 అడుగుల పొడవునా ఆక్రమణకు పాల్పడ్డారు. సుమారు 15 సెంట్ల వరకు ఆక్రమణ జరిగినట్లు అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ ప్రాంతంలో సెంటు భూమి ధర రూ.5 లక్షల వరకు ఉంది. ఆక్రమణకు గురైన భూమి విలువ దాదాపు రూ.80 లక్షల వరకు ఉంటుందని స్థానిక రైతులు చెబుతున్నారు.

ఆక్రమణలను గుర్తించాం..

ఇదే విషయమై తోటపల్లి ప్రాజెక్ట్ సబ్ డివిజన్–3 ఇంజినీర్ జి.సంతోషి మాట్లాడుతూ తోటపల్లి కుడి ప్రధాన కాలువలో 98.27 కిలోమీటర్ వద్ద కాలువ భూమి ఆక్రమణకు గురైనట్లు గుర్తించామన్నారు. సర్వేయర్‌ను తీసుకెళ్లి పూర్తి స్థాయిలో పరిశీలన చేసి ఆక్రమణదారులపై ఫిర్యాదు చేస్తామని చెప్పారు. విషయాన్ని ఉన్నత అధికారులదృష్టికి తీసుకెళ్లామని తెలిపారు.

సైబర్ నేరాలపై జాగ్రత్త

చీపురుపల్లిరూరల్: సైబర్ నేరాలు రోజు రోజుకూ పెరిగిపోతున్నాయని అప్రమత్తంగా ఉండాలని జిల్లా కేంద్ర సహకారబ్యాంకు కౌన్సిలర్ డబ్బాడ శ్రీను ప్రజలకు సూచించారు. పెదనడిపల్లి గ్రామంలో ప్రజలకు సైబర్ నేరాలపై గురువారం అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు ఖాతాలకు సంబంధించిన వివరాలను, ఏటీఎం కార్డుల పిన్ నంబర్లను తెలియని వ్యక్తులకు చెప్పవద్దని అన్నారు. లాటరీలు, ఇతర ఆఫర్ల పేరిట ఫోన్లకు వచ్చే నోటిఫికేషన్లను తెరవవద్దని సూచించారు. డీసీసీబీ కూడా రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా పరిధిలోకి చేరిందని, డిపాజిట్‌దారులకు అధిక వడ్డీ చెల్లించడానికి సిద్ధంగా ఉందన్నారు. పీఏసీఎస్ అధ్యక్షుడు పిసిని శ్రీనివాసరావు, ఎంపీటీసీ రేగాన ఆదినారాయణ పాల్గొన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్



విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఆశయ రమణ

చీపురుపల్లిరూరల్: బాగా చదువుకున్న విద్యార్థులకే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, పాఠశాల స్థాయిలోనే విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకోవాలని ఆశయ సంస్థ అధ్యక్షుడు రెడ్డి రమణ సూచించారు. మెట్టపల్లి ఉన్నత పాఠశాలలో ఆశయ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, కెరీర్ ప్లానింగ్‌పై గురువారం అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఉపాధ్యాయుడు జనార్దన్, అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు కిశోర్ పాల్గొన్నారు.

మొబైల్ ఫోన్లకు దూరంగా ఉంచండి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ భీమశంకరరావు

కొత్తవలస: పబ్లిక్ పరీక్షలకు సమయం ఆసన్నమైయిందని, విద్యార్థులను మొబైల్ ఫోన్లు, టీవీలకు దూరంగా ఉంచి, ఇళ్ల వద్ద వారి తో శ్రద్ధగా చదివించే బాధ్యత తల్లిదండ్రులు తీసుకోవాలని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.భీమశంకరరావు సూచించారు. కళాశాలలో తల్లిదండ్రుల సమావేశం గురువారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పిల్లలు చదువుకునేందు కు ఇంటి వద్ద చక్కటి వాతావరణం కల్పించాలని, మంచి పౌష్టికాహారం అందించాలని చెప్పారు. మాదకద్రవ్యాల ప్రభావం విద్యార్థులపై పడకుండా తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కళాశాలలో చేపడుతున్న నాడు–నేడు పనులను వివరించారు. తరగతి గదులు, ప్రయోగశాలలను తల్లిదండ్రులకు చూపించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఆర్‌ఈసీఎస్ ఏడీ బి.జగన్నాథం గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గరివిడి మండలం తాటిగూడ, గెడ్డపువలస, వి.పి.రేగ, రేగటి గ్రామాలకు, గుర్ల మండలంలోని పెదబంటుపల్లి, దేవుణికణపాక, లవిడాం, రౌతుపేట, పతివాడపేట గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని,వినియోగదారులు సహకరించాలని కోరారు.

చట్టాలపై అవగాహన

కొత్తవలస రూరల్: పోక్సో, దిశ చట్టాలు, బాల్య వివాహాలతో కలిగే అనర్థాలపై వియ్యంపేట బాలికల గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ టి.జయశ్రీ ఆధ్వర్యంలో విద్యార్థినులకు సచివాలయ మహిళా పోలీసు, పీహెచ్‌సీ సిబ్బంది గురువారం అవగాహన కల్పించారు. ఎవరైనా లైంగిక వైధింపులు చేసినా, అఘాయిత్యానికి పాల్పడినా పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. మహిళా పోలీస్ భారతి, ఎంపీహెచ్‌ఈఓ తిరుపతిరావు, హెచ్‌వీ పద్మావతి, హెల్త్ అసిస్టెంట్ సత్యారావు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా వాటర్‌ప్లాంట్ల నిర్వహణ



వాటర్‌ప్లాంట్‌లో తనిఖీలు చేస్తున్న అధికారులు

దత్తిరాజేరు: మండలంలోని దత్తి, దత్తిరాజేరు గ్రామాల్లో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న రెండు వాటర్ ప్లాంట్లను అధికారులు గురువారం గుర్తించారు. ఆహార భద్రతా అధికారి రాజారెడ్డి, తూనికల కొలతల ఇన్‌స్పెక్టర్ బలరాం, తహసీల్దార్ రమేష్ ఆయా వాటర్ ప్లాంట్లలో తనిఖీలు చేశారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా వాటర్ ప్యాకెట్లు తయారుచేసి విక్రయించడంపై సంబంధిత యజమానులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నివేదికను జిల్లా అధికారులకు పంపించి, వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు.

రక్తదాన శిబిరం



రక్తదాతలను అభినందిస్తున్న ఎస్ఐ సన్యాసినాయుడు తదితరులు

చీపురుపల్లిరూరల్: మెట్టపల్లి ప్రాథమిక పాఠశాలలో గ్రామానికి చెందిన నవభారత్ యువజన సేవాసంఘం ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎస్ఐ సన్యాసినాయుడు ప్రారంభించారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని ఆయన అన్నారు. రక్తదానం చేసిన 21 మంది యువకులను ఆయన అభినందించారు.నవభారత్ ఫౌండేషన్ అధ్యక్షుడు యు.హరి, ఆశయ సంస్థ అధ్యక్షుడు రెడ్డి రమణ, అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు కిశోర్‌కుమార్, రాధా సక్కు ఫౌండ్రీ హెచ్‌ఓడీ అఖిల్‌కుమార్, విజయనగరం న్యూలైఫ్ బ్లడ్ బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.